## భూ భారతితో భూ సమస్యలకు సత్వర పరిష్కారం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 24 : భూ భారతి చట్టంతో భూమి హక్కులు భద్రంగా ఉంటాయని, భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లిలో గురువారం భూ భారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ చట్టంలో భూముల వివరాలన్నీ తెలుస్తాయన్నారు. జిల్లాలో పోచంపల్లి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని, వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 23వరకు ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. భూ భారతి చట్టం పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం 67మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, 25 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఇంద్రియాల గ్రామంలో తెల్ల రేషన్ కార్డుదారుడు అనిల్ ఇంట్లో సన్న బియ్యం అన్నంతో భోజనం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఎంపీఓ మజీద్, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబూరావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కాంటాలు వేగవంతం చేయాలి : కలెక్టర్



పాటిమట్ల కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

మోత్కూరు, ఏప్రిల్ 24 : ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని పాటిమట్ల ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులను అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ ప్రమాణాల మేరకు తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం చేయించాలన్నారు. పాటిమట్లలో ధాన్యం రాశులు ఎక్కువగా పేరుకుపోవడాన్ని పరిశీలించారు. ప్యాడీ క్లీనర్ ఒక్కటే ఉన్నందున రైతులకు ఇబ్బంది కలుగకుండా మరో ప్యాడీ క్లీనర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ డీఎంను ఆదేశించారు. కాంటాలైన ధాన్యం రవాణాలో సమస్యలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, ఏఓ కీర్తి, ఏఈఓలు గోపీనాథ్, అశోక్, సీఈఓ కొణతం వరలక్ష్మి పాల్గొన్నారు.

## రైతులు దళారులను ఆశ్రయించవద్దు : డీసీఓ



పెద్దరావులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఓ మురళీరావు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 24 : రైతులు దళారులను ఆశ్రయించవద్దని, ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) మురళీరావు అన్నారు. మండలంలోని పెద్దరావులపల్లి గ్రామంలో జూలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 216 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో 2.5లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో జూలూరు పీఏసీఎస్ చైర్మన్ అందెల లింగంయాదవ్, మార్కెట్ డైరెక్టర్ రేణిగుంట లాలయ్య, సీఈఓ రేబాస్ నర్సింహ, పీఏసీఎస్ డైరెక్టర్ పెంటయ్య, నాయకులు ప్రభాకర్, బుచ్చయ్య, బాలరాజు, అంజయ్య, గణేశ్, అశోక్, పరమేశ్, బాలనర్సింహ, రైతులు పాల్గొన్నారు.

## నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలి : ఆర్డీఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 24 : మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో వచ్చే నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించే ఎరుకల నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలని ఆర్డీఓ శేఖర్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులు, నాయకులు, నిర్వాహకులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు అన్ని రకాల వసతులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. జాతర ఏర్పాటుకు సలహాలు అందించి విజయవంతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, ఎంపీఓ మజీద్, ఆర్ఐ గుత్తా వెంకటరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



రాఘవాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బీబీనగర్, ఏప్రిల్ 24 : మండలంలోని రాఘవాపురం, రుద్రవెల్లి, గూడూరు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ డైరెక్టర్లు చింతల శ్రీనివాస్‌రెడ్డి, బద్దం అంజిరెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాయకులు శ్యామ్‌గౌడ్, బాల్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, శ్రీనివాస్, ఆగమయ్యగౌడ్, కృష్ణ, అశోక్, రైతులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు : ఎంపీడీఓ



శర్భనాపురంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్

ఆలేరు రూరల్, ఏప్రిల్ 24 : అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయని ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ అన్నారు. మండలంలోని శర్భనాపురంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాల కోసం గురువారం ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన లబ్ధిదారులు 4నుంచి 6చదరపు అడుగుల స్థలంలో ఇండ్లు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కనకరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుగ్గ నవీన్, బొడ నరేశ్ పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



కొరటికల్‌లో బడిబాట ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 24 : గ్రామంలోని బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు దడిపల్లి వెంకన్న అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరికీ ఉత్తమ విద్య అందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంగమ్మ, మాజీ సర్పంచులు సత్తయ్యగౌడ్, పురుషోత్తం, దేవయ్య, లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ అనంతరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి : బీఆర్ఎస్



భువనగిరి అర్బన్ : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 24 : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై దాడులు జరిపిన ఉగ్రవాదులను వెంటనే శిక్షించాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన అమరులకు ఆత్మ శాంతి చేకూరాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరులైన కుటుంబాలను ఆదుకోవాలని, దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. దేశంలో శాంతిభద్రతలపై పట్టింపు లేకపోవడంతో 23మంది పర్యాటకులు తమ ప్రాణాలు కోల్పోయారన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించి, మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొలుపుల అమరేందర్, ఎనబోయిన ఆంజనేయులు, ఇక్బాల్, సూరజ్ పాల్గొన్నారు.

### గుట్టలో కొవ్వొత్తుల ర్యాలీ

యాదగిరిగుట్ట : జమ్మూ కాశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల చేతులో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్వామివారి వైకుంఠ ద్వారం నుంచి అమరవీరుల స్తూపం వరకు కొవ్వొత్తులు, జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద మౌనం పాటించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవుల సాయికిరణ్, పట్టణ అధ్యక్షుడు హరీశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, నాయకులు భానుప్రసాద్, రాజేశ్, భాను, ప్రవీణ్, అనిల్ పాల్గొన్నారు.

### ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గుట్టలో సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ఉగ్రవాదులను ఉక్కుపాదంతో అణిచివేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, పట్టణ కార్యదర్శి గోపగాని రాజు పాల్గొన్నారు.

### చౌటుప్పల్ లో శాంతి ర్యాలీ

చౌటుప్పల్ : పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ పట్టణంలో ముస్లిం మైనార్టీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ప్రశాంతంగా ఉన్న జమ్మూ కాశ్మీర్‌లో మతం ముసుగులో దాడి చేయడం సరికాదని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు బాబా షరీఫ్, కరీం, వహీద్‌బాయ్, కమురు, చాంద్ పాషా, అజ్జు, సయ్యద్ ఖదీర్, ఖదీర్ షేక్, ఇమ్రామ్ కమ్రుద్దీన్, ఖలీల్, రహీం పాల్గొన్నారు

### పోచంపల్లిలో నిరసన

భూదాన్ పోచంపల్లి : తీవ్రవాదుల దాడిని నిరసిస్తూ వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పట్టణంలో నేతాజీ చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బల్ల దుర్వాసులు, కటకం తుకారాం, చిక్క కృష్ణ, గంజి బసవలింగం, సాహేశ్‌కుమార్, మహేశ్, నాగేశ్వర్ అశోక్, వెంకటేశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### ఉగ్రవాదులను ఏరిపారేయాలి

గుండాల : భారత పౌరులపై పాకిస్థాన్ ఉగ్రవాదులు కాల్పులు జరిపిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను ఏరిపారేయాలని సుద్దాల ఆంజనేయ కమిటీ చైర్మన్ ఏలె లింగం అన్నారు. మండలంలోని సుద్దాల గ్రామంలో గురువారం ఉపాధి హామీ కూలీలతో కలిసి జమ్ముకాశ్మీర్‌లో మరణించిన భారత పౌరులకు మౌనం పాటించి నివాళి అర్పించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి, యాదయ్య, మోహన్‌రెడ్డి, నర్సయ్య, రాజు, నర్సిరెడ్డి, నరేశ్, లక్ష్మి, రమేశ్ పాల్గొన్నారు.




చౌటుప్పల్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న మైనార్టీలు




యాదగిరిగుట్టలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 24 : మండలంలోని రెడ్డిబావి గ్రామ పరిధిలో గురువారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరు గ్రామానికి చెందిన కొండె జంగయ్య, భార్య హైమావతి(37) గురువారం బైక్‌పై చౌటుప్పల్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యంలో రెడ్డిబావి గ్రామం వద్ద హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో హైమావతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

అడ్డగూడూరు, ఏప్రిల్ 24 : మండలంలోని బొడ్డుగూడెం గ్రామం వద్ద వలిగొండ – తొర్రూరు ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. డీసీఎంను కారు ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యాపేటకు చెందిన గౌరమ్మ (55) తీవ్రంగా గాయపడగా 108లో సూర్యాపేట దవాఖానకు తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వంగరి మహాలక్ష్మి, అనూష, ఆమె 16 రోజుల కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

### షార్ట్ సర్క్యూట్‌తో డాక్యుమెంట్ రైటర్ కార్యాలయం దగ్ధం

తుర్కపల్లి, ఏప్రిల్ 24 : ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో డాక్యుమెంట్ రైటర్ కార్యాలయంలోని కంప్యూటర్లతో సహా ఫర్నిచర్ దగ్ధమైంది. మండల కేంద్రంలోని శ్రీరుద్వేద్ డాక్యుమెంట్ రైటర్ కార్యాలయాన్ని నిర్వాహకుడు శివతేజ బుధవారం రాత్రి బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ హెచ్చుతగ్గులతో షార్ట్ సర్క్యూట్‌తో వైర్ల నుంచి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కార్యాలయంలోని కంప్యూటర్లు, ప్రింటర్లు ఇన్వర్టర్, క్యాష్ మిషన్‌తోపాటు ఫర్నిచర్‌కు మంటలు అంటుకొని పూర్తిగా కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్‌తో రూ.3లక్షలకు పైనే ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. శివతేజ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### ఓపెన్ జిమ్ పరికరాలు ధ్వంసం

బీబీనగర్, ఏప్రిల్ 24 : మండలంలోని బట్టుగూడెం గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ధ్వంసమైన జిమ్‌ను పరికరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్తిరెడ్డి గురువారం పరిశీలించారు. ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 24 : మండల కేంద్రంలోని సరస్వతి విద్యాలయంలో చదువుకుంటున్న జంపాల లావణ్య కుమారులైన పేద విద్యార్థులకు బీఆర్ఎస్ మండల నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దశరథగౌడ్ దంపతులు రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దశరథగౌడ్‌ను పాఠశాల కరస్పాండెంట్ తొర్ర విష్ణు, ప్రిన్సిపాల్ పంజాల నర్సయ్యగౌడ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బూడిద శేఖర్‌గౌడ్, చెరుకు శ్రీనివాస్ ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు.

### సత్య సాయిబాబా సేవలు చిరస్మరణీయం

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 24 : సామాన్య కుటుంబంలో పుట్టిన సత్య సాయిబాబా విద్య, వైద్యం, సామాజిక సేవలను ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని ఆధ్యాత్మికవేత్త సోమ సీతారాములు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో భగవాన్ సత్య సాయిబాబా 14వ వర్ధంతి (ఆరాధన) సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆరాధన మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్య సాయిబాబా సేవా సమితి సభ్యులు రాచమల్ల వినోద్‌కుమార్, పసుపునూరి నాగభూషణం, సోమ కృష్ణమూర్తి, పెంట బాలరాజు, కటకం వెంకటేశం, కరుణాకర్, సాయికృష్ణ, సరస్వతి, వాణి, ప్రమీల, శోభ, మౌనిక, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేశ్ పాల్గొన్నారు.

## 'మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి'



సమావేశంలో అభివాదం చేస్తున్న జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 24 : ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో మే 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్, జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్నదన్నారు. కార్మిక వర్గ సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను బానిసత్వంలోకి నెట్టే కుట్ర చేస్తున్నదని దుయ్యబట్టారు. జిల్లాలో సంఘటిత, అసంఘటిత, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులందరూ మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు రేగు బాలనర్సింహులు, జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, నాయకులు గణపతిరెడ్డి, పొట్ట యాదమ్మ, జహంగీర్, మంచాల మధు పాల్గొన్నారు.

## అనుమతి లేని శ్రీచైతన్య పాఠశాలను మూసివేయాలి

- ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు



మోత్కూరులో పాఠశాల కరపత్రాలను విడుదల చేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

మోత్కూరు, ఏప్రిల్ 24 : మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ గుర్తింపు లేని శ్రీచైతన్య పాఠశాలను మూసివేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు పాఠశాలపై ముద్రించిన కరపత్రాలను పట్టణంలో గురువారం విద్యార్థి సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు బుర్రు అనిల్‌కుమార్, ఉప్పల శాంతికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నారన్నారు. నిబంధనలు పాటించకుండా పాఠశాలను నిర్వహిస్తున్న యాజమాన్యంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిప్పలపల్లి చరణ్, జిల్లా రాకేశ్, చందు పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నిర్మల



భువనగిరి కలెక్టరేట్ : నిర్మలకు నియామక పత్రం అందజేస్తున్న అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 24 : అఖిల భారత యాదవ మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నరాల నిర్మల నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవియాదవ్ హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో నిర్మలకు గురువారం నియామక పత్రం అందజేశారు.

### జిల్లా ప్రధాన కార్యదర్శిగా జ్యోతి



కన్నెబోయిన జ్యోతి

రామన్నపేట : మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకురాలు కన్నెబోయిన జ్యోతిని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి హైదరాబాద్‌లోని తన నివాసంలో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సుక్కల సత్యంయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెబోయిన అయోధ్యయాదవ్, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

భూదాన్ పోచంపల్లి : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిల్లాయిపల్లిలో గురువారం గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు రావడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న వేతనాలను యథావిధిగా చెల్లించాలని, కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షులు గూడూరు బుచ్చిరెడ్డి, కార్మికులు గంగయ్య, బాబు, యాదయ్య, హంసమ్మ, పద్మ, జయమ్మ, గండమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా : భిక్షమయ్యగౌడ్



తూముకుంటలో సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

బొమ్మలరామారం, ఏప్రిల్ 24 : బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ అన్నారు. మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తొంట సత్యనారాయణ ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడ్డాడు. ఉప్పల కృష్ణకు మాతృవియోగం జరిగింది. సోలిపేట గ్రామానికి చెందిన చీర్ల యాదమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. బాధిత కుటుంబాలను భిక్షమయ్య గౌడ్ గురువారం పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, నాయకులు హారిక లక్ష్మారెడ్డి, నవీన్‌గౌడ్, శంకరయ్య, శ్రీకాంత్ గౌడ్, బాలయ్య, నాగరాజు, అశోక్, నర్సింహ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి రావాలి



రాగిబావి గ్రామంలో నినాదాలు చేస్తున బీఆర్ఎస్ నాయకులు

మోత్కూరు, ఏప్రిల్ 24 : వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యంలో ప్రజలను తరలించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అన్నారు. మండలంలోని రాగిబావి, పనకబండ గ్రామాల్లో గురువారం జరిగిన పార్టీ గ్రామ శాఖ కార్యకర్తల సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, నాయకులు రాంపాక నాగయ్య, పి.మత్స్యగిరి, వెంకటేశం, నర్సిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభకు పెద్ద ఎత్తున తరలించాలి



బోగారం గ్రామంలో బీఆర్ఎస్ సభ పోస్టర్లు అంటిస్తున్న నాయకులు

రామన్నపేట, ఏప్రిల్ 24 : బీఆర్ఎస్ రజోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలించాలని ఆ పార్టీ నాయకుడు బద్దుల రమేశ్ అన్నారు. మండలంలోని బోగారం గ్రామంలో రజోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించి గోడలకు అంటించారు. ఈ సందర్భంగా మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రజలు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంతటి మల్లేశం, రాజు, మల్లేశం, రాజు, నవీన్, పద్మయ్య, మల్లేశం, నరేశ్ పాల్గొన్నారు.

## ఊరురా గులాబీ పండుగ



కుర్రారంలో బీఆర్ఎస్ దిమ్మెకు రంగులు వేయిస్తున్న నాయకులు

రాజాపేట, ఏప్రిల్ 24 : బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఊరురా పండుగలా నిర్వహించేలా పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం గులాబీ జెండా ఎగురవేయడానికి దిమ్మెలను రంగులతో తీర్చిదిద్దుతున్నారు. గులాబీ జెండా ఎగురవేసిన అనంతరం రజతోత్సవ సభకు తరలి వెళడానికి సిద్ధమవుతున్నారు.

## 'తల్లిదండ్రుల కన్నీరు పిల్లలకు శాపమే'




యాదగిరిగుట్ట : టాస్కా ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు జయమోహనాచార్యులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 24 : మహిళ కంట కన్నీరు సమాజానికి ఎంత అనర్థమో తల్లిదండ్రుల కన్నీరు పిల్లలకు శాపమే అవుతుందని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు ముడుంబై జయమోహనాచార్యులు అన్నారు. మండలంలోని మల్లాపురం గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం గ్రామ వయోధికులతో కలిసి టాస్కా ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల ఆశీస్సులు, అనుభవం ఉత్తమ జీవిత మార్గానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో టాస్కా సభ్యులు రాగి సహదేవ్, నూకల సుధాకర్‌రెడ్డి, గుంటి యాదగిరి, గుండ్లపల్లి మల్లేశం, వయోధికులు పాల్గొన్నారు.

## 'అక్రమ వెంచర్‌దారుపై చర్యలు తీసుకోవాలి'

మోత్కూరు, ఏప్రిల్ 24 : మున్సిపాలిటీలోని పోతాయిగడ్డలో స్మైల్ వెంచర్ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావుకు స్థానికులు వినతి పత్రం అందజేశారు. మోత్కూరులో భూ భారతిపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు వచ్చిన కలెక్టర్‌కు సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ పట్టణంలోని 457 సర్వే నెంబర్‌లో స్మైల్ నూతన వెంచర్‌ను ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేయడం వల్ల చెరువు నీళ్లు పట్టణంలోని ఇండ్లలోకి వస్తుందన్నారు. తమకు చెందిన 12 ఎకరాల్లో వరద నీరు నిల్వ ఉండటం వల్ల తాము ఉపాధిని కోల్పోతున్నామని తెలిపారు. వెంచర్ అక్రమ నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బయ్యని రాజు, పోచం సోమయ్య, అంబోజు రామ్మూర్తి, ఎస్‌డీ జలాల్ పాల్గొన్నారు.

## 'ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి'

చౌటుప్పల్, ఏప్రిల్ 24 : యాదగిరిగుట్టలో ఈ నెల 29న నిర్వహించే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండూరి వెంకటేశ్ అన్నారు. చౌటుప్పల్‌లో గురువారం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సభలో యువత ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుండెబోయిన భాస్కర్, బద్దం సాయితేజ, దాసరి మనోహర్, ఎన్.రాఘవ్, బరిగెల వేణు, సాయి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : యాదగిరిగుట్టలో ఈ నెల 29న జరుగనున్న ఏఐవైఎఫ్ జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేశ్ కోరారు. మండల కేంద్రంలో గురువారం మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రదాదులను అంతమొందించాలన్నారు. భారత పౌరులపై జరిగిన ఉగ్రదాడికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అల్లంశెట్టి వెంకటేశ్, ఎండీ నహీం, ముత్యాలు, రవి, షబ్బీర్, రాంచందర్ పాల్గొన్నారు.